సాక్షి ఒడిశా

బుధవారం । 18 । జనవరి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,56,349లు, బంగారం 600 మిల్లీ గ్రాములు, వెండి 358 గ్రాములు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.



మహిళ ఆత్మహత్యాయత్నం

- 8లో.



ముగిసిన పుషిపుణి ఉత్సవాలు

- 8లో.

న్యూస్‌రీల్

మార్టులో చోరీకి యత్నం



కోల్‌కత్తా మార్ట్

రాయగడ: స్థానిక మెయిన్ రోడ్డులో డాక్టర్ వైఆర్‌రావు క్లీనిక్ ఎదురుగా ఉండే కోల్‌కత్తా మార్ట్‌లో చోరీకి యత్నం జరిగింది. గుర్తు తెలియని దుండగులు మెయిన్ షట్టర్‌ను విరిచి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అటువైపుగా ఏదో శబ్దం రావడంతో పారిపోయారు. మంగళవారం ఉదయం యథావిధిగా మార్ట్‌ను తెరిచేందుకు వచ్చిన సిబ్బంది షట్టర్ విరగొట్టి ఉండడం చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చిన్నారులకు గాయాలు



చికిత్స పొందుతున్న గణపతి పిడికాక

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి జిగిడి పంచాయతీ కార్యాలయంలో ఒక ఇనుప గ్రిల్ పడిన ప్రమాదంలో ముగ్గురు చిన్నారులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పీడీఎస్ బియ్యం పంపిణీ జరుగుతుండగా, బియ్యం కోసం వచ్చిన కొంతమంది తల్లిదండ్రులు వారి పిల్లలను తీసుకొచ్చారు. పిల్లలంతా పక్కనే ఉన్న ఇనుప గ్రిల్‌ను పట్టుకొని ఆడుతుండగా గ్రిల్ వారిపై పడిపోవడంతో బాసంతి పిడికాక (6), గణపతి పిడికాక(5), ఖగేశ్వర్ పిడికాక (5)లకు గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్నవారు గ్రిల్ కింద ఇరుకున్న పిల్లలను బయటకు తీసి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలైనవారిలో గణపతి, ఖగేశ్వర్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

యువకుడి ఆత్మహత్య





ఉరికి వేలాడుతున్న రాంబాబు మృతదేహం (ఇన్‌సెట్లో) రాంబాబు (ఫైల్)

రాయగడ: స్థానిక రాణిగుడఫారం ఏడో లైన్‌లో ఉన్న ఒక గదిలో యువకుడి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. మృతుడు విద్యానగర్ 5వ లైన్‌లో నివాసముంటున్న పి.రాంబాబు (27)గా పోలీసులు గుర్తించారు. ఐఐసీ రస్మారంజన్ ప్రధాన్ తెలిపిన వివరాల మేరకు.. గత కొన్నేళ్లుగా రాణిగుఢ ఫారంలో ఒక మహిళ తన కుమార్తెతో ఒక ఇంటిలో అద్దెకు నివాసముంటోంది. ఈ క్రమంలో రాంబాబు ఆ ఇంటికి తరుచూ వెళ్తూ ఉండేవాడు. అయితే పదిహేను రోజుల క్రితం సదరు మహిళ ఏదో పనిమీద మరో ఊరు వెళ్లడంతో గదిలో ఒక్కడే ఉంటున్నారు. మంగళవారం ఉదయం మహిళ పెద్దమ్మ ఆ ఇంటికి వెళ్లి చూడగా గది తలుపులు తెరిచి ఉండడంతో పాటు ఉరికి వేలాడుతున్న మృతదేహాన్ని చూసి అవాక్కయ్యింది. వెంటనే స్థానిక పోలీసులకు సంఘటన విషయమై సమాచారం అందించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీకి స్థలం వితరణ



సర్పంచ్‌కు స్థలం డాక్యుమెంట్లు అందజేస్తున్న మిశ్రా

రాయగడ: జిల్లాలోని మునిగుడ పంచాయతీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు 42 సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన ప్రదీప్ మిశ్రా వితరణగా అందజేసి ఉదారతను చాటుకున్నారు. పంచాయతీలో కాలువ, రహదారి వంటి పనులకు సంబంధించి తన సొంత స్థలంకు చెందిన డాక్యుమెంట్లను సర్పంచ్ సరస్వతీ సాబొరాకు మంగళవారం అందించారు. ఆయనను గ్రామస్తులు అభినందించారు.

ఉత్సవానికి వేళాయే..!



అమ్మవారి ఆహ్వాన పత్రికను పూజారికి అందజేస్తున్న బౌరి



సాంస్కృతిక కార్యక్రమాలకు సిద్ధమవుతున్న వేదిక

- నేటి నుంచి చౌయితి ఉత్సవాలు
- మజ్జిగౌరి అమ్మవారికి మొదటి ఆహ్వాన పత్రిక
- ముస్తాబైన రాయగడ నగరం

9099

రాయగడ: ఆదివాసీ భాషా, సంస్కృతికి ప్రతీకగా నిలిచే చౌయితి ఉత్సవాలు రాయగడలో నేటి నుంచి ప్రారంభమవ్వనున్నాయి. ఉత్సవంలో భాగంగా పట్టణ ప్రజల ఆరాధ్య దైవం మజ్జిగౌరి మందిరం నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు కలశ యాత్ర ప్రారంభమవుతుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి కలశాలను ఊరేగింపుగా స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించనున్న ఉత్సవాల వేదిక వద్దకు తీసుకెళ్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి జగన్నాథ సరక, కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్, ఎస్పీ వివేకానంద శర్మ తదితరులు హాజరవుతారు. ఉత్సవం కోసం రాయగడ నగరం సుందరంగా ముస్తాబైంది.

ప్రత్యేక పూజలు

ఉత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరుగుతాయి. ఉత్సవాలు నిరాటంకంగా జరగాలని మజ్జిగౌరికి అమ్మవారికి మొదటి ఆహ్వాన పత్రికను అధికారులు అందజేశారు. జిల్లా సాంస్కృతి విభాగం అధికారి సులోచన బౌరి ఆహ్వాన పత్రికను తీసుకెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించారు. పత్రికను పూజారికి అందించి అమ్మవారి ఆశీర్వాదాలను తీసుకున్నారు.

పటిష్ట బందోబస్తు

ఐదు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేసింది. పట్టణంలో అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు వేదిక వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా 13 ప్లాటూన్ల పోలీసు బలగాలు విధులు నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారు. దీని కోసం పోలీసుల హెల్ప్‌డెస్క్‌లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది.

స్వాగత ద్వారం

ఆదివాసీ తెగల్లో ఒకటిగా గుర్తించిన లంజియా సవర తెగకు చెందిన సంస్కృతిని ప్రతిబింబించే ఇడితాల్ చిత్రాలతో స్వాగత ద్వారం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కళాకారులు చిత్రాలు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఉత్సవాలకు ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అదేవిధంగా ఉత్సవ ప్రాంగణంలో స్టాల్‌లు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల నమూనాలతో స్టాల్స్‌లో ప్రదర్శన ఉంటుంది. అలాగే పల్లిశ్రీ మేళా ఈసారి ఒర్మాస్ సంస్థ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.

నగరమంతా సందడి వాతావరణ

ఉత్సవాలను పురస్కరించుకొని రాయగడ నగరంలో సందడి వాతావరణం నెలకొంది. పట్టణమంతా విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబైంది. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి ఇరువైపులా విద్యుత్ అలంకరణలు ఆకర్షణీయంగా ఉన్నాయి. అదేవిధంగా గాంధీ పార్క్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అలకంరణలు ఆకట్టుకుంటున్నాయి.



గోడలపై వేసిన చిత్రాలు

హాకీపై ప్రచారం

స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానం ప్రహరీ గోడలపై వేసిన హాకీ ఆటల ప్రదర్శన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. కళాకారులతో ప్రత్యేకంగా వీటిని వేయించారు. హాకీ ఆటకు వేదికగా నిలిచే రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడించే విధంగా చిత్రాలు కళాకారులు వేసి తమ ప్రతిభను చాటుకున్నారు.



విధులు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు



ఉత్సవంలో ఏర్పాటు చేసిన స్టాల్స్



ఆకట్టుకుంటున్న విద్యుత్ అలంకరణలు

255 కిలోల గంజాయి స్వాధీనం



అరెస్టు చేసిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

- ఐదుగురు వ్యక్తులు అరెస్టు

బరంపురం: గత రెండు రోజులుగా వివిధ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి 255 కిలోల గంజాయితో పాటు ఐదుగురు వ్యక్తులకు అరెస్టు చేశారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అశోక్ సత్తపతి తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందడంతో గంగపూర్ పోలీసుస్టేషన్ పరిధి గజపతి జిల్లా మోనా బ్లాక్ గుముసర అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరంలోకి వాహనాలు వచ్చే ఫస్ట్‌గేట్ జంక్షన్ దగ్గర కారుపై దాడి నిర్వహించి మొత్తం 4 బస్తాల్లో 155 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో కారుని స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేశారు. నిందితుడు పశ్చిమ బెంగాల్‌కి చెందిన సంతున్ పరిడాగా గుర్తించారు. అలాగే దిగపండి పోలీసుస్టేషన్ పరిధి సికిరి జంక్షన్‌లో మరో కారు, స్కూటీపై దాడులు నిర్వహించి 100 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో ప్రమోద్ దొళాయి, హామాస్ పరిడా, పింటు నాయక్, తపన్ నాయకులు ఉన్నట్లు పోలీసులు తెలియజేశారు.

పోలీసుల అదుపులో వృద్ధ దంపతులు



వృద్ధ దంపతులను తీసుకెళ్తున్న పోలీసులు

రాయగడ: తమకు న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యకు సైతం వెనకాడమని కలెక్టర్ కార్యాలయానికి మంగళవారం వచ్చిన వృద్ధ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరి పంచాయతీ నువాపడ గ్రామానికి చెందిన ఫిలిప్స్ బెహర, బాసంతి తురుక్‌లు తమకు చెందిన 16 సెంట్ల స్థలాన్ని టికిరిలో ఉన్న ఉత్కళ అల్యూమినా కర్మాగారం ఆక్రమించుకుందని ఫిర్యాదు చేశారు. సుమారు 18 ఏళ్లు గడిచినప్పటికీ తమకు నష్ట పరిహారం చెల్లించలేదు సరికదా తమ స్థలాన్ని ఇచ్చేందుకు నిరాకరిస్తోందని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యకు సైతం వెనుకాడమని హెచ్చరిస్తూ వినతిపత్రాన్ని కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్‌కు సమర్పించారు. దీంతో వృద్ధ దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

‘బకాయి వేతనాలు చెల్లించాలి’



మాట్లాడుతున్న కమ్యూనిస్టు పార్టీ నేతలు



అధికారుల నివాసాల ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక సేవా పేపర్ మిల్లు శ్రామికులు, విశ్రాంత ఉద్యోగులకు మిల్లు యాజమాన్యం బకాయి వేతనాలను చెల్లించాలని భారతీయ కమ్యూనిస్టు పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కార్మిక భవనంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జుధిష్ఠ్ రౌళో, సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యుడు, కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి, సీనియర్ నేత సుశాంత అధికారిలు మాట్లాడారు. వేతన బకాయిలను వెంటనే చెల్లించకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మిల్లు విశ్రాంత శ్రామికులు ఎంతోకాలంగా తమకు రావలసిన బకాయిలను చెల్లించాలని కోరుతున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈనెల మూడో తేదీ నుంచి మిల్లు పరిపాలన అధికారుల నివాసాల ముందు ఒక్కొక్క శ్రామికుడు ఆందోళనలు జరుపుతున్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కొరాపుట్ జిల్లా కలెక్టర్ సేవా పేపరు మిల్లు శ్రామికుల సమస్యలపై సమయం లేకపోవడంతో దృష్టి సారించలేకపోతున్నారో.. లేక రాజకీయ ఒత్తిడి కారణంగానో సమస్యలను పరిష్కరించడం లేదో తెలియడం లేదన్నారు. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి కూడా మిన్నకున్నారని ఆరోపించారు.

• రికార్డు



పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ ఆవిష్కరించిన అతిపెద్ద సైకత హాకీ స్టిక్ వరల్డ్ రికార్డ్స్ ఇండియా బుక్‌లోకి ఎక్కింది. పురుషుల ప్రపంచ హాకీ కప్-23 మ్యాచ్‌లు పురస్కరించుకొని కటక్ మహానది తీరంలో ఈ సైకత శిల్పం తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. ఈనెల 10వ తేదీన 5 వేల హాకీ బంతులతో 105 అడుగుల పొడవైన హాకీ స్టిక్ ఇసుకతో తీర్చిదిద్దారు. వరల్డ్ రికార్డ్స్ ఇండియా వ్యవస్థాపకుడు పావన్ సోలంకి, హెచ్‌వోడీ సుష్మా నర్వేకర్, సీనియర్ అజుడికేటరు సంజయ్ నర్వేకర్‌లు ఇది అత్యంత పొడవైన సైకత హాకీ స్టిక్‌గా అధికారికంగా ప్రకటించారు.

- భువనేశ్వర్

హై కెపాసిటీ సబ్‌స్టేషన్లు ప్రారంభం

- ప్రజలకు అంకితం చేసిన సీఎం నవీన్ పట్నాయక్



వర్చువల్ విధానంలో సబ్ స్టేషన్లను ప్రారంభిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలోని 4 జిల్లాల్లో 5 హై కెపాసిటీ గ్రిడ్ సబ్‌స్టేషన్లను సీఎం నవీన్ పట్నాయక్ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. వీటి కోసం రూ.254 కోట్లు వెచ్చించారు. వీటివలన గంజాం జిల్లాలోని హింజిలికాటు, మల్కాగిరిలో కలిమెల, సువర్ణపూర్‌లో బీర మహారాజ్ పూర్, కటక్ జిల్లాలో గొడిసాహి, బహంగ్రామ్ ప్రాంతాల్లో 2 లక్షల మంది లబ్ధి పొందుతారని సీఎం పేర్కొన్నారు. ప్రజల జీవన శైలి మెరుగుపడేందుకు విద్యుత్ అవసరమన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యమన్నారు. విద్యుత్‌ను వృథా చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 185 అదనపు హైవోల్టేజీ గ్రిడ్ సబ్‌స్టేషన్లతో 16,000 సర్క్యూట్ కిలోమీటర్ల నెట్‌వర్క్ అందుబాటులో ఉంది. విద్యుత్ ఉత్పాదన, సరఫరా, పంపిణీ రంగంలో రాష్ట్రం మిగులు సాధిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి ప్రతాప్ కేశరి దేవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఒడిశా కోల్ అండ్ పవర్ లిమిటెడ్ (ఓసీపీఎల్) ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.20 కోట్లను అందించింది. ముఖ్యమంత్రి సమక్షంలో విద్యుత్ శాఖ మంత్రి ప్రతాప్ కేశరి దేవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చెక్కు అందజేశారు. స్వల్ప వ్యవధిలో ఒడిశా కోల్ అండ్ పవర్ లిమిటెడ్ లాభసాటి సంస్థగా అభివృద్ధి చెందడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బరంపురం లోక్‌సభ సభ్యుడు చంద్రశేఖర్ సాహు, నవరంగ్‌పూర్ ఎంపీ రమేశ్ చంద్ర మాఝీ, బీర్ మహారాజ్‌పూర్ ఎమ్మెల్యే పద్మనాభ్ బెహెరా, బంకి ఎమ్మెల్యే దేవీ రంజన్ త్రిపాఠి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సీఎంతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేష్ చంద్ర మహాపాత్రో, ముఖ్యమంత్రి కార్యదర్శి (5–టి) వి. కె.పాండియన్, అదనపు ప్రధాన కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలా తదితర అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా

సీబీఐ సోదాలు

భువనేశ్వర్: విశ్రాంత రైల్వే అధికారి ఇంట్లో సీబీఐ మంగళవారం సోదాలు చేపట్టింది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. 1989వ సంవత్సరపు భారతీయ రైల్వే ట్రాఫిక్ సేవా విభాగం బ్యాచ్‌కు చెందిన ప్రమోద్ జెనా ఆర్జన పరిమితికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని ఆరోపణ ఉంది. దీంతో ఈనెల 3వ తేదీన ఆయనకు వ్యతిరేకంగా సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో చేపట్టిన సోదాల్లో 17 కిలోల బంగారం, రూ.1.57 కోట్ల నగదు జప్తు చేశారు. జప్తు చేసిన బంగారం విలువ దాదాపు రూ.8.50 కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్ ఖాతాలో రూ.2.50 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. భువనేశ్వర్ సహా 6 చోట్ల ఏకకాలంలో చేపట్టిన సోదాల్లో అక్రమ ఆస్తులపై ఆరా తీస్తున్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జయపురం: జిల్లాలోని కోట్‌పాడ్ సమితిలో ప్రగతి సంస్థ మినప, వేరుశనగ విత్తనాలను రైతులకు మంగళవారం పంపిణీ చేశారు. ఒడిశా ప్రభుత్వ రైస్ ఫ్యాల్ మేనేజ్‌మెంట్ పథకంలో భాగంగా ప్రగతి సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. క్షతరంగ్ పంచాయతీలో 50 ఎకరాలకు, సుతిపొదర్, చందిలి పంచాయతీల్లో 40 ఎకరాలకు విత్తనాలు అందజేశారు. అలాగే మహిళా స్వయం సహాయక గ్రూపుల వారికి ఎకరాకు 16 కేజీల శనగ విత్తనాలు, 8 కేజీల చొప్పున మినప విత్తనాలు చొప్పున అందజేశారు. ఒడిశా రాష్ట్రంలో పప్పు ధాన్యాలు విస్తృతంగా పండించే లక్ష్యంతో రైతులకు ఉచితంగా విత్తనాలు సమకూర్చుతున్నట్లు ప్రగతి సంస్థ అధికారులు వెల్లడించారు.

స్టాఫ్ నర్సు పోస్టుల ఎంపికలో గందరగోళం

- నేటికి కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ వాయిదా

మహారాణిపేట(విశాఖదక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం ప్రకటించిన జాబితాపై గందరగోళం నెలకొంది. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ నిరుద్యోగ నర్సులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ పోస్టుల్లో తమకు వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ బుధవారానికి వాయిదా పడింది. స్టాఫ్ నర్స్ పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపిక జాబితాను వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ శనివారం విడుదల చేశారు. ఈ నెల 17, 18వ తేదీల్లో కౌన్సెలింగ్ చేపట్టి.. నియామక పత్రాలు జారీ చేయాలని నిర్ణయించారు. పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్ది జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ కొంతమంది నిరుద్యోగ నర్సులు, వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు మంగళవారం కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు.

కొట్లాటలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న గణనాథం

పార్వతీపురం: ఇద్దరి మధ్య వాదులాట ఘర్షణకు దారితీసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం రాత్రి పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో ఇద్దరు మూగవాళ్ల మధ్య ఘర్షణ జరిగింది. అది కాస్తా వారి తల్లిదండ్రుల మధ్య తీవ్ర వాదోపవాదాలకు దారితీయడంతో కొట్లాట జరిగింది. ఈ ఘర్షణలో దొగ్గ గణనాథాన్ని అదే గ్రామానికి చెందిన వర్రి శ్రీను రైలు పెంకుతో తలపై కొట్టాడు. దీంతో గణనాథం తలకు గాయం కావవడంతో స్థానికులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: జాతీయ చేనేత అభివృద్ధి పథకం(ఎన్‌హెచ్‌డీపీ)లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో ఏర్పాటైన రెండు క్లస్టర్ డెవలప్‌మెంట్ పథకా(సీడీపీ)లకు 14 పోస్టులు మంజూరైనట్లు చేనేత, జౌళి శాఖ జిల్లా అధికారి ఐ. ధర్మారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ, నారాయణపురంలలో ఈక్లస్టర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు మంజూరైన సీడీపీల్లో టెక్స్‌టైల్స్ డిజైనర్ 7 ఖాళీలు, క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్ 7 ఖాళీలు ఉన్నాయని ఆసక్తిగల అభ్యర్థులు సంచాలకుడు, చేనేత, జౌళి శాఖ, అమరావతి చిరునామాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా మాసోత్సవాలు


ఒడిస్సీ నృత్యం చేస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: జిల్లాలో గత రెండు రోజులుగా మాల్యవాంత్ మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. కలెక్టర్ విశాల్‌సింగ్ పిలుపు మేరకు ఒడియా భాష సాహిత్యం, సాంస్కృతిక శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సత్యబ్రోతో సాహు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కొరాపుట్ బీఎస్ఎఫ్ డీఐజీ సైలేంద్ర సిన్హా, నవరంగ్‌పూర్ కలెక్టర్ కమలోచన్ మిశ్రో, కొరాపుట్ కలెక్టర్ అబ్దుల్ ఎం.అక్బర్, ఎస్పీ నితీష్‌వాద్వనీ తదితరులు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ముఖ్య అతిథి సత్యబ్రోత సాహు అన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


ఉత్సవాలు చూసేందుకు తరలి వచ్చిన ప్రజలు


గిరిజన నృత్యం చేస్తున్న కళాకారిణి


కోలకత్త నూపూ

పద ఉత్సవాలు ప్రారంభం


ఒడిస్సీ నృత్యం చేస్తున్న దృశ్యం


గిరిజన సాంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు


యుద్ధ విన్యాసాలు చేపడుతున్న యువత


కత్తి, డాలు పట్టిన కలెక్టర్ లింగరాజ్ పండా, డీఎస్పీ బామదేవ్ సింగ్ దేవ్

పర్లాకిమిడి: గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడి రాజవీధిలో పురపాలక శాఖ ఆధ్వర్యంలో పద ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈనెల 18 నుంచి స్థానిక గజపతి స్టేడియంలో గజపతి ఉత్సవాలు జరుగనున్న దృష్ట్యా స్థానిక కళాకారులు ఒడిస్సీ, పాయక్ సమరయోధుల కత్తిసాము, స్కేటింగ్, తైక్వాండ్, ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక కళాకారులకు ఈ పదోత్సవాల ద్వారా మంచి ప్రోత్సాహం లభిస్తుందని కలెక్టర్ లింగరాజ్ పండా అన్నారు. ఉత్సవాలను తిలకించడానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ లింగరాజ్ పండా విచ్చేసి కళాకారులతో ఆడి పాడారు. కార్యక్రమానికి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, వైస్ చైర్మన్ లెంకమధు, యువరాణి కల్యాణీ దేవి గజపతి, బీజేడీ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ నాయక్, జిల్లా అదనపు ఎస్పీ బామదేవ్ సింగ్, ఆదర్శ పోలీసుస్టేషన్ ఐఐసీ వివేకనంద స్వయిం తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


ట్రాఫిక్ కానిస్టేబుల్ కాపాడిన తల్లీబిడ్డలు


బ్రిడ్జి పైనుంచి దూకడానికి సిద్ధమైన మహిళ


భువనేశ్వర్: కటక్ నగరంలోని రద్దీగా ఉండే ప్రాంతంలో ఒక మహిళ బిడ్డతో సహా మంగళవారం ఆత్మహత్యాయత్నం చేసింది. విధి నిర్వహణలో నిమగ్నమై ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ తపన్ కుమార్ దాస్ సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. మధుపట్న ఓవర్ బ్రిడ్జిపై నుంచి దూకిన మహిళ ఆత్మహత్యాయత్నానికి చేస్తున్న ప్రయత్నాన్ని గుర్తించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ స్థానికుల సహకారంతో ఆమెని కాపాడాడు. స్థానిక పోలీసులు ఆమెని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. మహిళ ప్రాణాలతో పసికందు ప్రాణాలు కాపాడగలగడంపై కానిస్టేబుల్ సంతృప్తి వ్యక్తం చేస్తున్నాడు.

ముగిసిన సంక్రాంతి సంబరాలు



సేవా కమిటీ సభ్యులను సన్మానిస్తున్న పృధ్వీరాజ్

జయపురం: జయపురంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ముగిశాయి. అఖిల్ ఈవెంట్స్, హెచ్.కె.సుహాషిణి ట్రస్టులు సంయుక్తంగా నిర్వహించిన వేడుకల్లో తెలుగు సినీ నటుడు పృధ్వీరాజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'కొత్త రంగుల ప్రపంచం' తెలుగు చిత్రం నటులు క్రాంతిరెడ్డి, మిస్ శ్రీలు తమ హావభావాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. చెన్నై నుంచి వచ్చిన సింగర్ రాము, హైదరాబాద్ గాయకులు నందిత జ్యోతి, బోయిస్ ఆఫ్ సింగర్ బైజాగ్ సమీర్, సబిహా, విశాఖ నుంచి వచ్చిన వెస్టర్న్ డాన్స్ టీమ్‌లు చక్కని ప్రదర్శణలతో ఆకట్టుకున్నాయి. జయపురం అఖిల మ్యూజిక్ సంగీత కళాకారులు రాంబాబు, సంతు, ఇందర, జగదీష్ తదితరులు ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా తెలుగు కథల అనువాదకులు, రచయిత, భారతి సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వాహకులు కె.బి.రమణను, సీనియర్ క్రికెట్ ఆటగాడు సీహెచ్ నాగేష్‌లను పృధ్వీరాజ్ సన్మానించారు. అదేవిధంగా జయపురం సబ్‌డివిజన్‌లో విద్యాప్రగతి, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణకు గత 25 ఏళ్లుగా ఎనలేని సేవలు అందిస్తున్న జయపురం సోషియల్ ఎడ్యుకేషనల్, ఎన్విరాన్‌మెంటల్, అసోసియేషన్ కమిటీని ప్రత్యేకంగా సన్మానించారు.

ముగిసిన పుషిపుణి ఉత్సవాలు


డ్రమ్ము వాయిస్తున్న గిరిజన బాలుడు


నాట్యం వేస్తున్న దృశ్యం


విల్లు ఎక్కుపెడుతున్న దృశ్యం


ఆదివాసీ అలంకరణలో చిన్నారి

జయపురం: కొరాపుట్ జిల్లా ఆదివాసీ జీవన విధానాన్ని ప్రతిబింబించే పుషిపుణి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. స్థానిక విక్రమ క్రీడా మైదానంలో ఈనెల 6వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు మొత్తం 11 రోజులు వైభవంగా జరిగాయి. ముగింపు కార్యక్రమానికి అతిథులుగా మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార పటాన్నయిక్, చైర్‌పర్సన్ నరేంద్రకుమార్ పట్నాయిక్, జయపురం సబ్ డివిజన్ పోలీసు అధికారి హరీష్ హాజరయ్యారు. ముగింపు రోజు ఉత్సవాలు తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. మున్సిపల్ అధికారి సిద్దార్థ పట్నాయిక్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న కొరాపుట్ ఆదివాసీ సంస్కృతి కళల పరిరక్షణే పుషిపుణి మహోత్సవాల ప్రధాన లక్ష్యమని వివరించారు.


ముగింపు వేడుకలో పాల్గొన్న జన సమూహం

గుర్తు తెలియని వ్యక్తి హత్య

- బొబ్బిలి డీఎస్పీ బి.మోహన్‌రావు

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి దూరంగా మామిడి తోటలో సోమవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలించగా అది కచ్చితంగా హత్యేనని నిర్ధారించినట్లు బొబ్బిలి డీఎస్పీ బి.మోహన్‌రావు స్పష్టంచేశారు. మృతదేహం లభ్యమైన ప్రదేశాన్ని పరిశీలించిన అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న రాచగుమడాం వెళ్లే మట్టి రోడ్డు పక్కనే ఉన్న మామిడి తోటలో లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పరిశీలింగా నాలుగైదు రోజుల క్రితం మరణించి ఉందని తెలిపారు. మరణించిన వ్యక్తి వీపుపై ఉన్న కత్తిపోట్లు, మెడ, తలపైనా ఉన్న గాయాలను బట్టి హత్య చేసి మామిడి తోటలో పడేసినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. అయితే హత్యకు గురైన వ్యక్తి వివరాలు తెలియరాలేదన్నారు. మృతునికి 40–50 సంవత్సరాల మధ్య వయస్సు ఉండవచ్చని, 5.7అడుగుల ఎత్తు ఉన్నాడని చెప్పారు. మృతుడు వేసుకున్న దుస్తులు డాక్ కంపెనీకి చెందిన డ్రాయర్, నలుపురంగు బెల్ట్, సిమెంట్ రంగు ఫ్యాంట్ ఫస్ట్ బటన్ కంపెనీవన్నారు. హత్యకు గురైన వ్యక్తి ఇటీవలే మూలవ్యాధి శస్త్ర చికిత్స చేయించుకున్నట్లు ఆనవాళ్లు కనిపించినట్లు తెలిపారు. పై పోలికలతో ఉన్న వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని డీఎస్పీ మోహన్‌రావు కోరారు. సమావేశంలో ఆయనతోపాటు బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు, రామభద్రపురం, తెర్లాం ఎస్సైలు బి.సురేంద్రనాయుడు, బి.రమేష్ ఉన్నారు.


తెర్లాంలో విలేకరులతో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో నివాసముంటున్న కొండగొర్రి చిన్నయ్య అలియస్ సూర్యనారాయణ(44) మనస్తాపంతో మంగళవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఎల్విన్‌పేట పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నయ్య భార్య ఏడాది క్రితం కనుమ రోజున మృతిచెందింది. భార్య ఉండి ఉంటే ఇబ్బందులుండేవి కాదని గుర్తుచేసుకుంటూ తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయం చూసి చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. మృతుడికి పన్నెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

పురుగు మందు తాగి వృద్ధుడు..

వంగర: మండల పరిధి ఇరువాడ పంచాయతీ చంద్రంపేట గ్రామానికి చెందిన వృద్ధుడు మడక జగన్నాథం(70) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై బుడుమూరు లోకేశ్వర రావు తెలిపారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుడు ఈ నెల 13న పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు గమనించి విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని, మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వర రావు వెల్లడించారు.


ఆత్మహత్యకు పాల్పడిన చిన్నయ్య

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పాలకొండ రూరల్: పాలకొండ–వీరఘట్టం రహదారిలో రాయుని కోనేటి వద్ద గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో పేకాట నిర్వహిస్తున్న, ఆడుతున్న ఏడుగురిని పాలకొండ ఎస్సై బి.శివప్రసాద్ అరెస్టు చేశారు. స్థానిక పోలీసులు ఎస్సై నేతృత్వంలో మంగళవారం పెట్రోలింగ్ చేపట్టిన సమయంలో పేకాట ఆడుతున్న వారిని గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.9,400 స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పేకాట శిబిరాలు నిర్వహించినా, నిషేధిత క్రీడలను ప్రోత్సహించినా చట్టపరమైన కేసులు తప్పవని హెచ్చరించారు.

క్లుప్తంగా

బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ, ఉద్యోగాల కల్పన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో బయాలజీ సైన్స్, సోషియాలజీ, సోషల్ సైన్సు, పబ్లిక్ హెల్త్‌లో డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఎచ్చెర్లలోని ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో గల డీటీడీసీలో 4 నెలలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణకు హాజరైన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ పూర్తయిన వారికి కార్పొరేట్, ఇతర ఆస్పత్రుల్లో ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. 20–30 మధ్య వయసులో ఉన్న వారు అర్హులని, వివరాల కోసం 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డాక్యుమెంట్లు దగ్ధం



కాలిపోయిన దుకాణం

రణస్థలం: మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో దస్తావేజు లేఖర్లు భద్రపరుచుకునే డాక్యుమెంట్ల దుకాణం అగ్నికి ఆహుతైంది. ఈ సందర్భంగా లేఖర్లు మాట్లాడుతూ మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి దుకాణం కాలిపోయి ఉందని, గుర్తు తెలియని వ్యక్తులు పక్కన చెత్తపోగేసి కాల్చినట్లు ఉందని, వాటితో పాటు పక్కనే ఉన్న దుకాణం కాలిపోయి ఉండవచ్చని చెప్పారు. విలువైన పత్రాలు బూడిదైపోయాయని తెలిపారు.

చింతామణి అమ్మవారికి బంగారు కానుక



అమ్మవారికి బంగారు కానుక బహూకరిస్తున్న పాపారావు దంపతులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి ప్రవాస భారతీయుడు బుర్రకాయల పాపారావు రాజేశ్వరి దంపతులు రూ.1.10 లక్షల విలువైన బంగారు కానుకను బహూకరించడం అభినందనీయమని కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో రెండు తులాల ఆభరణాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులర బెందాళం వెంకటేశ్వరరావు, పాండవ చంద్రశేఖర్, పినింటి జయరావు, ఆరంగి త్రివిక్రమరావు, పినింటి జయరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి రాము, గిరి తదితరులు పాల్గొన్నారు. కాగా, సంక్రాంతి పండుగ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బొరివంకలోని కాళీమాత ఆలయం, బల్లిపుటుగ, కుసుంపురంలో సింధుపురాణి అమ్మవారి ఆలయాలు సైతం భక్తులతో రద్దీగా కనిపించాయి.

సైనికుల సేవలు మరువలేనివి



పెదవంకలో విశ్రాంత జవాన్లను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేశ రక్షణలో సైనికులు అందించే సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురంలో జై గణేష యువజన సంఘం ఆధ్వర్యంలో 8 మంది విశ్రాంత ఆర్మీ జవాన్లు, పోలీసులను మంగళవారం ఘనంగా సన్మానించారు. పెదవంకలో భారత సైనిక అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గురు జవాన్లను సత్కరించారు. ఈ సందర్భంగా దేశ సేవలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. సైన్యంలో చేరి దేశానికి సేవలు అందించడంలో ఉద్దాన యువత ముందంజలో ఉన్నారన్నారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై గణేష యువజన సభ్యులు బత్తిని ప్రదీప్, గుజ్జు మనోహర్, రెయ్యి చాణక్య, బత్తిని ప్రశాంత్, డిఫెన్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రుణమే వ్రణమై..

- చెలరేగుతున్న లోన్ యాప్ నిర్వాహకులు
- వారి వలలో పడి మోసపోతున్న యువత
- ఎటువంటి హామీ లేకుండా అప్పులిస్తామని ఎర
- తక్షణమే రుణమిచ్చి 40నుంచి 50శాతం వడ్డీ వసూలు



లోన్‌యాప్‌ల నెట్‌ఫొటోలు

పార్వతీపురం టౌన్: అరచేతిలో ప్రపంచాన్ని చూపిస్తున్న మొబైల్ టెక్నాలజీ అదే చేత్తో ప్రజల ప్రాణాలను కూడా బలి తీసుకుంటోంది. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని లోన్ యాప్‌ల నిర్వాహకులు చెలరేగిపోతున్నారు. వారి వలలో పడి రుణాలు తీసుకుంటున్న అమాయకులు. తిరిగి చెల్లించలేనప్పుడు వారి వేధింపులు తాళలేక తనువు చాలిస్తున్నారు. ఇటువంటి సంఘటనల్లో కొన్ని మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. నిర్వాహకుల వేధింపులు, పరువు, ప్రతిష్ఠలు రోడ్డున పడతాయనే భయంతో ఆందోళనలో ఏం చేయాలో తెలియక ప్రాణాలు పైకి తెచ్చుకుంటున్నారు.

హామీ లేకుండా రుణాలతో వల

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి..'హామీ లేకుండానే రుణం పొందండి' అని లోన్ యాప్స్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలు ఇవి. హామీ అవసరమే లేదనడంతో పేద, మధ్యతరగతి వర్గాల వారు ఆకర్షితులై వారి మొబైల్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. వివరాలు ఇవ్వడమే ఆలస్యం. క్షణాల్లో రూ.50 వేల లోపు రుణం వారి ఖాతాలో జమైపోతోంది. ఇలా ఆన్‌లైన్ ఆధారిత లోన్ యాప్ ఉచ్చులోకి లాగుతున్నారు. రుణం ఇచ్చేటప్పుడు హుందాగా వ్యవహరించే నిర్వాహకులు చెల్లించడం ఒక్క రోజు ఆలస్యమైనా బెదిరింపులు, వేధింపులకు దిగుతున్నారు. డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడే మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లు, ఫొటోలు, వీడియోలు సహా అన్నింటికీ యాప్ నిర్వాహకులకు యాక్సెస్ ఇవ్వాలి. లేదంటే రుణం రాదంటారు. యాక్సెస్ ఇవ్వగానే రుణం తీసుకున్న వారి ఫోన్ వివరాలు లోన్ యాప్ సర్వర్లకు అనుసంధానమవుతాయి. అవసరార్థం అప్పు ఇస్తే చాలనుకునే సందర్భంలో షరతులు, నిబంధనలను చూసుకోకుండానే చాలామంది అంగీకరిస్తున్నారు. అదే వారి పాలిట యమపాశమవుతోంది.

భరించలేని వేధింపులు

రుణం తీసుకున్న రోజు నుంచే చెల్లింపుల కోసంనిర్వాహకులు ఒత్తిడి తెస్తున్నారు. చెల్లింపు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు పెరిగిపోతాయి. రుణగ్రహీత మొబైల్ నంబర్లకు పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించే పోస్టులు, దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, ఫొటోలు పంపిస్తారు. బెదిరింపులు లెక్క చేయకపోతే రుణగ్రహీత కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ 'నగ్నంగా మార్చి మొబైల్‌లోని కాంటాక్ట్ నంబర్లన్నింటికీ వాట్సాప్‌లో పంపుతారు. బతికుండగానే అతడి ఫొటోకు దండేసి చనిపోయినట్లు ప్రచారం చేయడం. ఇలా లోన్‌యాప్ నిర్వాహకుల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. వారి ఆగడాలను కొందరు బయటకు చెప్పుకోలేక కుమిలిపోతూ బలవన్మరణాలకు పాల్పడుతుంటే.. ఇంకొందరు ఒక యాప్‌లోని అప్పు తీర్చేందుకు మరో యాప్‌లో రుణం తీసుకుంటూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఈజీ రుణంతో వల

లోన్ యాప్‌లో రుణం కోసం ఎటువంటి హామీ అవసరం లేదు.

- మొబైల్ ఉండి, లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.
- హామీ లేకుండా రూ.2,000 నుంచి రూ.50 వేల వరకూ లోన్ యాప్‌లో ఇస్తుంటారు.
- రుణం చెల్లింపులో ఒక్క రోజు ఆలస్యమైనా లోన్ యాప్ నిర్వాహకులు ఉపేక్షించరు.
- లోన్ యాప్‌డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా మొబైల్‌లోని వ్యక్తిగత డేటా (సమగ్ర సమాచారం) నిర్వాహకుల గుప్పిట్లోకి వెళ్లిపోతుంది.

కొత్త కొత్త పేర్లతో..

యాప్‌లను మొబైల్‌లోని ప్లేస్టోర్ నుంచి తొలగించడంతో నిర్వాహకులు ఇప్పుడు కొత్త కొత్త పేర్లతో తెరపైకి వచ్చారు. క్యాష్ బెస్. లెండ్ మాల్ క్యాష్ అడ్వాన్స్ రుపీ కింగ్, రుపీ బాక్స్, ఓకే సన్ ఫైన్, టౌన్ మనీ గ్రాంట్, భారత్ లోన్, ముషీ గ్రాంట్ గోల్డ్ బీ టెండ్ మాల్, భారత్ క్యాష్, ఏ ఫూర్, లెండ్ రోజే టెండ్, స్మాల్ క్యాష్, ఎక్స్ పీ క్యాష్, మనలీ మాస్టర్, లెండ్ కింగ్, లిండ్ పోస్ట్, కోకో ఫాస్ట్, కోకో లెండ్ వంటి పేర్లతో ఇప్పుడు కార్యకలాపాలతో నిర్వాహకులు అమాయక ప్రజలను మోసాలు చేస్తున్నారు.

'అపరిచిత యాప్‌లపై అప్రమత్తం అవసరం



చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో మనకు తెలియని అపరిచిత యాప్ కనిపిస్తే అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రతి యాప్‌ను అయాచితంగా క్లిక్‌చేసే అలవాటుతో ఇబ్బందులు కొని తెచ్చుకుంటారు. అడ్డగోలు లోన్ యాప్‌లోకి వెళ్తే మీ వ్యక్తిగత సమాచారం వారి గుప్పిట్లోకి వెళ్తోంది. మోసపూరితంగా ఉంటున్న లోన్‌యాప్‌ల జోలికి దయచేసి వెళ్లొద్దు. నిర్వాహకులు వేధిస్తున్న తక్షణమే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే కాకుండా సంబంధిత బ్యాంకు అధికారులను కూడా సంప్రదించాలి.

–ఒ.దిలీప్‌కిరణ్,
జిల్లా అదనపు ఎస్పీ, పార్వతీపురం మన్యం

లోన్ యాప్‌ల జోలికి పోవద్దు



లోన్ యాప్‌ల జోలికి పోయి లేనిపోని ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దు. ప్లేస్టోర్‌లో అనుమతులు లేని యాప్‌ల నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి సారించాం. లోన్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల మొబైల్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారం నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తోంది. వాటిని ఆసరాగా తీసుకుని బెదిరింపులకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. ప్రజలు లోన్‌యాప్‌ల జోలికి వెళ్లి ఎటువంటి ఇబ్బందులు పడవద్దు. ఎవరైనా లోన్ యాప్‌ల నిర్వాహకులు వేధించినట్టితే తక్షణమే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. అలాగే సంబంధిత బ్యాంకు అధికారులకు కూడా విషయాన్ని తెలియపరిచి అకౌంట్‌ను లాక్‌చేసుకోండి.

–విద్యాసాగర్ నాయుడు,
ఎస్పీ, పార్వతీపురం మన్యం

ఆటో- ద్విచక్ర వాహనం ఢీ

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



మృతిచెందిన బబ్బుల్లా

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి పంచాయతీ గోపినాథపురం గ్రామానికి చెందిన పండా బబ్బుల్లా (40) తన భార్య జగదీశ్వరి, కుమార్తెతో కలిసి సొంత ఆటోలో సంత బొమ్మాళి మండలం భావనపాడు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన పేరాడ పవన్ అనే యువకుడు టెక్కలి నుంచి స్వగ్రామం వస్తుండగా ఇజ్జువరం సమీపంలో ఆటో, బైక్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ బబ్బుల్లా, బైక్ నడుపుతున్న పవన్ గాయపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత పొందుతూ బబ్బుల్లా మృతిచెందాడు. పవన్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు. సంతబొమ్మాళి పోలీసులు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆడపిల్లలకు అండ కల్యాణమస్తు!



- అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చిన పథకం
- ఎస్సీ, ఎస్టీలకు రెట్టింపు పైకం
- కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

ఇచ్ఛాపురం రూరల్: మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రజా సంకల్పయాత్రలో ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడుతూ 'వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా వంటి అద్భుతమైన పథకాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022 అక్టోబర్ ఒకటో తేదీ నుంచే ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

గత ప్రభుత్వం కంటే..

ప్రస్తుత పరిస్థితుల్లో పెళ్లంటే లక్షలాది రూపాయలు చేతిలో ఉండాలి. అందులో ఆడపిల్ల పెళ్లంటే పేదింటి వారు భయపడతారు. అప్పు చేసి పెళ్లి జరిపించి బిడ్డను అత్తవారింటికి సాగపంపుతారు. పెళ్లి కోసం చేసిన అప్పును తీర్చడానికి చాలా కష్టపడుతుంటారు. అటువంటి పరిస్థితి ఎవరికీ రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'కల్యాణమస్తు'కు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 'చంద్రన్న పెళ్లి కానుక'పథకం కింద ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందిస్తే.. ఇప్పుడా మొత్తాన్ని సీఎం జగన్ భారీగా పెంచి నేనున్నానని భరోసా కల్పించారు.

ప్రోత్సాహకం ఇలా..

ఎస్సీ, ఎస్టీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.2 లక్షలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.1.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, బీసీలకు రూ. 50 వేలు, కులాంతర వివాహాలు చేసుకుటే బీసీలకు రూ.75 వేలు, ముస్లింలకు లక్ష రూపాయలను ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు.

అర్హత.. నిబంధనలు..

- వధువుకు 18, వరుడికి 21 ఏళ్లు నిండాలి
- పదో తరగతి పాస్ కావాలి
- ఆడపిల్లకు మొదటి పెళ్లికి మాత్రమే నగదు ప్రోత్సాహం ఉంటుంది
- భర్త చనిపోయిన సందర్భంలో వితంతువుకు మినహాయింపు ఇస్తారు
- భార్య చనిపోయిన మగవారికి రెండో పెళ్లికి పథకం వర్తించదు
- వధూవరులు ఇద్దరూ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి
- గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు, పట్టణ ప్రాంతంలో రూ.12 వేలు నెలసరి ఆదాయం కలిగినవారే అర్హులు
- మూడెకరాల్లోపు మాగాణి, పదెకరాల మెట్ట, మాగాణి, మెట్ట కలిపి పది ఎకరాలున్న వారు అర్హులు

అనర్హులు వీరే..

- ✘ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పింఛన్ తీసుకుంటున్న కుటుంబాలకు చెందిన వారికి పథకం వర్తించదు. పారిశుధ్య కార్మిక కుటుంబాలకు మినహాయింపు ఉంటుంది
- ✘ నాలుగు చక్రాల వాహనం ఉన్నవారికి పథకం వర్తించదు. ట్యాక్సీలు, ఆటోలు, ట్రాక్టర్లు ఉన్నవారికి మినహాయింపు ఉంటుంది
- ✘ ఆదాయపు పన్ను చెల్లించేవారికి పథకం వర్తించదు
- ✘ పట్టణ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగులు మించిన నిర్మాణ ఆస్తి ఉన్నవారు అనర్హులు
- ✘ 2022 అక్టోబర్ ఒకటో తేదీ తరువాత వివాహం చేసుకున్న దంపతులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.
- ✘ పెళ్లి జరిగిన 60 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

పండగ పూట విషాదం

- వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



మృతిచెందిన అప్పలస్వామి



మృతిచెందిన రాజారావు



మోహనరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలో జర్జంగి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం కింజరాపువానిపేటకు చెందిన బర్ల అప్పలస్వామి(30) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి పండగకు అప్పలస్వామి తన అత్తవారిల్లు కోటబొమ్మాళి మండలం ఎలమంచిలి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరి జర్జంగి వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అప్పలస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అప్పలస్వామికి భార్య రఘుపతిలక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్‌ఖాదర్ బాషా తెలిపారు.

పురుగుల మందు తాగి..

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం .. సీపన్నాయుడుపేటలో నివాసముంటున్న గరుగుబిల్లి రాజారావు (45)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి స్వగ్రామం పొందూరు మండలం పిల్లలవలస. కొంతకాలంగా సీపన్నాయుడుపేటలోనే ఉంటున్నారు. తాపీమేస్త్రీగా పనిచేస్తున్న రాజారావు వెన్నెముక వ్యాధి, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు కూడా తోడవ్వడంతో ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజారావు కుమారుడు దిలీప్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఆర్మీజవాన్..

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ పూజారి మోహనరావు(39) గుండెపోటుతో రాజస్థాన్‌లో మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్‌లో విధులు నిర్వహించగా, శిక్షణ నిమిత్తం ఇటీవల రాజస్థాన్ వెళ్లినట్లు చెప్పారు. ఎప్పటిలాగే శిక్షణ నిమిత్తం గ్రౌండ్‌లో ఉండగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు ఆర్మీ కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు వెల్లడించారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

సర్కారు సాయంతో ఇంతింతై..!

- పీఎంఈజీపీ రుణాలపై మహిళల ఆసక్తి
- జిల్లా వ్యాప్తంగా 456 దరఖాస్తులు
- 118 యూనిట్ల ప్రారంభం
- 35 శాతం సబ్సిడీతో రుణాలు
- చేగోడీల తయారీ, విస్తర్ల యూనిట్లు పెడుతున్న మహిళలు
- పాన్‌షాపుల నిర్వహణతో రాణింపు



పాగిరిలో చేగోడీల ఫ్యాక్టరీ పెట్టుకున్న లబ్ధిదారు

రాజాం: మహిళల ఆర్థిక పరిపుష్టి ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ఆసరాగా నిలుస్తోంది. ఈ క్రమంలో వారు అన్నిరంగాల్లో రాణించేందుకు చర్యలు తీసుకుంటోంది. అమ్మఒడి, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాలతో మహిళలకు ఆర్థికంగా చేయూతనిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు పీఎంఈజీపీ రుణాల ద్వారా వారు మరింత ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రాధాన్యం ఇస్తోంది. మహిళలకు రుణాలు మంజూరు చేసి స్వయం ఉపాధి పరిశ్రమలు ఏర్పాటుచేయిస్తోంది. ఈ మేరకు గ్రామాల్లో వైఎస్ఆర్ క్రాంతి పథం ద్వారా అవగాహన కల్పిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 456 దరఖాస్తులు

జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా 500 యూనిట్ల ఏర్పాటును డీఆర్‌డీఏ లక్ష్యంగా చేసుకుంది. ఇప్పటివరకూ ఈ పథకానికి సంబంధించి 456 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 118 యూనిట్లకు రుణాలు మంజూరు చేసి చేసి రూ.1.25 కోట్లు రుణంగా విడుదల చేశారు. 35 శాతం సబ్సిడీతో ఈ రుణాలు ఇచ్చినట్లు డీఆర్‌డీఏ ప్రకటించింది. బ్యాంక్ విల్లింగ్ ఉన్న దరఖాస్తుదారులకు వాటిని మంజూరు చేస్తున్నారు. రుణాన్ని సకాలంలో చెల్లించినవారికి మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది. మరో 113 యూనిట్లకు పరిశీలన పూర్తికాగా వాటికి కూడా ఈ నెలాఖరులోగా రుణాలు విడుదలచేయనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.50 వేల కనీస రుణం నుంచి రూ. 25 లక్షల వరకూ ఇస్తున్నారు. ఈ సారి వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువ మంది మహిళాసంఘాల సభ్యులు ఉండడం విశేషం.

కుటీర పరిశ్రమలకు తోడ్పాటు

పీఎమ్ఈజీపీ రుణాల ద్వారా మహిళలు లబ్ధిపొందుతున్నారు. ఎక్కువగా చేగోడీల తయారీ ఫ్యాక్టరీలు, అట్ట విస్తర్ల తయారీ పరిశ్రమలు నెలకొల్పుతున్నారు. ప్రతిరోజూ నలుగురి నుంచి ఆరుగురు వరకూ మహిళలు ఈ పరిశ్రమల ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఇవే కాకుండా ఆర్గానిక్ కూరగాయల సాగు, పాడి పరిశ్రమ ఏర్పాటు, కోడిగుడ్ల విక్రయాలు వంటి ఉపాధి మార్కెట్‌లు పెట్టి లబ్ధిపొందుతున్నారు. ఇంటి ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు కూడా ఒడ్డెక్కుతున్నట్లు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రాజయ్యపేటలో పేపర్‌ప్లేట్ల పరిశ్రమ

చాలా మంచి పథకం



పీఎంఈజీపీ చాలా మంచి పథకం. ఈ పథకానికి ప్రోత్సాహనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. బ్యాంకులు గ్యారంటీ ఇస్తే రుణాలు తక్షణమే మంజూరవుతున్నాయి. కుటీర పరిశ్రమలు పక్కాగా నడుపుతూ మహిళా సంఘాల సభ్యులు ఎక్కువ లబ్ధిపొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ రుణాలను ఎక్కువగా మహిళా సంఘాలు వినియోగించుకుంటున్నాయి.

ఎ.కల్యాణ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ

ఉపాధి ఇచ్చింది



మేం పీఎంఈజీపీ ద్వారా పేపర్ విస్తళ్ల ఫ్యాక్టరీ పెట్టాం. 35 శాతం రాయితీ లభించింది. మంచి ఫలితాలు వస్తున్నాయి. కొంతమంది మహిళలు కూడా ప్రతి రోజూ పనిచేస్తూ లబ్ధిపొందుతున్నారు. రాజాం క్లస్టర్ పరిధిలో చాలా మంది మహిళలు ఈ రుణాల ద్వారా కుటీర పరిశ్రమలు, పాన్‌షాపులు వంటివి పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు.

సామంతుల అరుణకుమారి,
రాజయ్యపేట. రాజాం మండలం

కార్లకు నిప్పంటించిన దుండగులు



కాలిబూడిదైన కార్లు ఇవే

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జగన్నాథ దాబా సమీపంలోని కారు షెడ్ వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు కార్లకు నిప్పటించి పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస జగన్నాథ దాబా పక్కన ముకుంద కార్‌షెడ్ వద్ద ఉంది. మరమ్మత్తుల నిమిత్తం రెండు కార్లను షెడ్డు బయట ఉంచి షెడ్ యజమాని వెళ్లిపోయారు. మంగళవారం రాత్రి 11.21 గంటల సమయంలో ఇద్దరు యువకులు ముఖాలకు ముసుగేసుకుని వచ్చి కార్లకు నిప్పటించారు. ఒక్కసారిగా మంటల చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకుని కార్‌షెడ్ యజమాని ముకుంద కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసినప్పటికి ప్రయోజనం లేకపోయింది. కాగా, యువకులు కార్లకు నిప్పంటించిన ఘటన అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఈ ఫుటేజీలను శ్రీకాకుళం క్రైం కార్యాలయానికి పంపించి పరిశీలన చేస్తున్నారు. కాశీబుగ్గ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు కార్ల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు.